139

# గంగా గౌరీ సంవాదం

శ్రీరామ

విశాఖపట్నం,
15.12.1998.

డియర్ గంగా,

నీ దగ్గరనుంచి ఉత్తరం వచ్చి చాలా కాలమైంది. నేను కూడా బద్ధకించి రాయలేదు. నీ స్త్రీవాద కథలు, కవితలు పత్రికల్లో చూస్తూనే ఉన్నాను. బందరులో సుశీల, సుబ్రహ్మణ్యం విడిపోయిన శుభ సందర్భంలో కలిసినప్పుడు నీతో కొంచెం మాట్లాడాలన్నాను, గుర్తుందా? ఆ తర్వాత నిన్ను కలవడమే వీలు పడింది కాదు. నా వ్యక్తిగత సమస్యలు చర్చించి నీ సలహా తీసుకోవాలని ఈ ఉత్తరం రాస్తున్నాను.

గంగా! నువ్వు లింగమూర్తిని వదిలేసి చాలా తప్పు చేశావు. గంగిగోవులా నువ్వు కూర్చోమంటే కూర్చుని, నించోమంటే నించునే లింగమూర్తి ఇతనేనా అనిపిస్తోంది, ఇప్పుడు చూస్తుంటే. అతని ఫెమినిస్టు భార్యా బాధితుల (భాబా) సంఘంలో రాఘవ లైఫ్ మెంబరుగా చేరాడు ఈ మధ్య. రాఘవ సంగతి నీకు తెలుసుకదా! అసలే కోతి - ఆ కోతికి ఇప్పుడు సుగ్రీవుడి లాంటి గురువు లింగమూర్తి దొరికాడు.

ఫెమినిస్టు సిద్ధాంతాల వెలుగులో కళ్ళు తెరిచిన నేను, 'ఇంటి పనులు వెట్టి చాకిరి - నేను చెయ్యను' అన్నాను. సరే అయితే, అన్నాడు రాఘవ. రోజూ పొద్దుటే కుర్రాడిని సైకిలు మీద తీసుకెళ్ళి స్కూలు బస్సెక్కించేవాడు. మర్నాడు వెళ్ళనన్నాడు.

ఎందుకు వెళ్ళవు అంటే, నువ్వు చేసేది వెట్టిచాకిరి అయితే నేను చేసేదీ వెట్టిచాకిరీయే, అన్నాడు. పెద్ద యుద్ధం జరిగింది. చివరకు ఓ అంగీకారానికొచ్చాం. అతని జీతం, నాజీతం ఓ డబ్బాలో పడేసి, ఎవరు ఏ పని చేస్తే ఆ పనికి దానిలోంచి డబ్బులు తీసుకోవాలని నిర్ణయించాం.

రోజా సైకిలు మీద వెళ్లేవాడు - ఈ ఒడంబడిక అయినప్పటినుంచి ఆటోలో వెళుతున్నానని ఆటో ఛార్జీలు తీసుకుంటున్నాడు. పొద్దుట స్కూలు బస్సు ఎక్కించడానికి, మధ్యాహ్నం క్రెచ్ నుంచి ఇంటికి తీసుకురావడానికి ఆటో ఛార్జీలు ..... నిజంగానే ఆటోలో వెళ్ళార్రా అని కుర్రాడిని అడిగాను. ఆటో ఎక్కడ? ఆ డొక్కు సైకిలు మీదే, అన్నాడు వాడు. నిలదీసి అడిగితే, తను ఐదు హార్సుపవర్ మనిషట, సైకిల్ను ఆటోలా తొక్కేస్తాడట, ఇదే ఆఫీసు పని కనుక అయితే టాక్సీ ఛార్జీలు వసూలు చేసేవాడట, ఇంటిపని కదా అని కొంచెం తగ్గించి నన్ను ఉద్ధరిస్తున్నాడట - ఇదీ సమాధానం. పోనీలే అని ఊరుకుంటే, గెడ్డం గీసుకున్నప్పుడల్లా పది రూపాయలు తీసుకోవడం మొదలు పెట్టాడు. నువ్వు గెడ్డం గీసుకుని పది రూపాయలు తీసుకోవడమేవిటంటే, మంగలి షాపు కెడితే వాడు పది రూపాయలు తీసుకుంటాడు కదా, అంటాడు. 'నువ్వు ఎకనమిక్ ఆనర్స్ ఎలా చేశావో నాకు తెలియదు కానీ, దేనికైనా మార్కెట్లో రానంతవరకు విలువ వుండదు. ఇంట్లో నీ గెడ్డం నువ్వు గీసుకుంటే విలువుండదు మొగుడా' అన్నాను. 'ఎందుకుండదు? కావాలంటే నీ గురివి నడుగు' అన్నాడు. గురివి ఏవిటన్నాను అర్థం కాక. గురువు పుల్లింగంట. గురివి స్త్రీలింగంట. ఆడ గురువుల్ని గురివి అనాలట - లింగమూర్తి చెప్పాడట (ఈ లింగమూర్తి భాషా విప్లవంతో చంపేస్తున్నాడు). నెల తిరిగేటప్పటికి ఎవరి జీతం వాళ్ళకే పోయింది. పని పని లాగానే ఉంది. ఇద్దరం చేసే ఇంటి పనికి విలువ ఎలా కట్టాలో తెలియడం లేదు గంగా!

మరో సంఘటన. కిందటి వారం మా ఇంట్లో ఫెమినిస్టులం కొందరం సమావేశమయ్యాం. 'రాఘవా! కాఫీ పెట్టు' అన్నాను. మాట్లాడకుండా లేచి, అలమైరాలోంచి రిజిస్టరు తీసి, ఆరు కాఫీలు తాను పెట్టినట్టు రాసి, వంటింట్లోకి వెళ్లాడు రాఘవ. మేమందరం కబుర్లలో ఉండగా, నా ఎదురుగా కూర్చున్న ఉమ కెవ్వున కేకేసి నిలబడింది. ఏవిటా అని చూస్తే నా వెనుక ట్రేలో కాఫీ కప్పులతో రాఘవ. పలుచటి చారల అండర్వేర్ తప్ప మరేమీ లేదు.

లుంగీయో, పైజామాయో కట్టుకు ఏడ్వచ్చుగా, అన్నాను. వంటింట్లో వేడిగా ఉందట. అండర్వేరులోనే హాయిగా వుందట. 'హాయిగా ఉండటవేమిటి? నలుగురు ఆడవాళ్ళు కూర్చున్న చోటికి బుద్ధున్న ఏ మగాడూ అలా రాడు. సభ్యత,' అని మందలించాను. 'నా సెక్సువాలిటీ మీద నీ కంట్రోలు ఏమిటి?' అంటూ తిరగబడ్డాడు. నేను లోపలి గదిలోకి ఈడ్చుకెళ్ళి 'దేనికైనా టైం అండ్ ప్లేస్ వుంటాయి. వాటికనుగుణంగానే మనం వ్యవహరిస్తాం. నీ సెక్సువాలిటీ రోడ్ల మీద, డ్రాయింగ్ రూంలోనూ కాదు - పడకగదిలో చూపించు - నేనూ సంతోషిస్తాను' అని చివాట్లు పెట్టాను.

ఆ రాత్రి బయట వాన పడుతూ చిరుచలిగా వుంది. రాఘవ సాయంకాలం నుంచి టేబులు దగ్గర కూర్చుని వంచిన తల ఎత్తకుండా ఏదో రాస్తున్నాడు, చింపేస్తున్నాడు. రాత్రి పదకొండయినా మంచం ఎక్కకపోతే నాకు విసుగుపుట్టి 'నేను మధ్యాహ్నం ఏం చెప్పానో గుర్తుందా బుద్దూ' అన్నాను, నైటీ వేసుకుంటూ. 'ఏం చెప్పావు' అన్నాడు వంచిన తల ఎత్తకుండానే. నీ సెక్సువాలిటీ చూపించడానికి పడకగది ఉంది అన్నాను, గుర్తుందా? అన్నాను ఓ రూపాయి ఎడ్వాన్స్ పడేస్తూ. గుర్తుంది కాని తను రాతలో బిజీగా ఉన్నాడట. తనకిష్టమైతే మంచం ఎక్కుతాడట. లేకపోతే లేదట. 'నీ ఇష్టం. నా ఇష్టం' అంటూ పంతాలకు పోతే సంసారం కావేరీ గోదారీ అవుతుంది. పెళ్ళయ్యాక కొంత అడ్జస్టు అవ్వాలి' అన్నాను. 'నీ గురివి కూడా అలాగే అంటుందా? రోజా పెళ్ళాలు మొగుళ్ళ చేత రేప్ చెయ్యబడతారు అంటుంది కదా' అన్నాడు వాదనలోకి దిగుతూ. 'గురివి సంగతి అలా వుంచు - పిచ్చి పిచ్చి వేషాలు వేసేవంటే ఇప్పుడు నేను నిన్ను రేప్ చెయ్యాల్సి వుంటుంది,' అని వార్నింగిచ్చాను ఒళ్ళు మండి. అయినా కదల్లేదు.

లింగమూర్తి బాగానే ఎక్కించాడు అనుకుని కొంచెం వాతావరణం తేలిక పరచడానికి 'ఏవిటి రాస్తున్నావు?' అనడిగాను. కథ రాస్తున్నానన్నాడు. 'ఈ పైత్యం ఎప్పటినుంచీ' అన్నాను. 'ఇవాల్టి నుంచే' అన్నాడు. లింగమూర్తి మగవాద పత్రిక 'మగోడు' ప్రారంభిస్తున్నాడట. ఈయనగారు ప్రారంభ సంచికకు కథ రాస్తున్నాడట. ఏం కథ? అనడిగాను.

కథ పేరు 'రావుడి గుండు'. రావుడనే వాడికి చిన్నప్పట్నుంచీ రాకేష్ రోషన్లా చనివిడిగుండు చేయించుకోవాలని తీరని కోరికట. చిన్నప్పుడు వాడి నాన్న, 'వెధవా! నేను చచ్చాననుకున్నావా? వీల్లేదు' అని చావగొడతాడు. పెళ్ళయ్యాక ఆ కోరిక తీరుతుంది అనుకుంటే 'గుండు చేయించుకొస్తే గుండు పగలగొడతాను' అని వాడి పెళ్ళాం అప్పడాల కర్రతో వార్నింగిస్తుంది. రావుడి కోరిక తీరకుండానే ట్రాఫిక్ ఐలేండు లాంటి బట్టతల వచ్చేస్తుంది. ఇదీ గుండు కథ.

నా మొహంలా వుంది నీ కథ, అన్నాను. నీ మొహం మగవాద రాజకీయ కథలా వుందా? అంటూ మొదలు పెట్టాడు. రావుడి గుండే కాదు - ఈయన్లీ స్పెషలిస్టులా రావుడి చెవి, రావుడి ముక్కు, రావుడి గొంతు అంటూ ఓ అరడజను మగవాద కథలు రాయబోతున్నాడట. పాఠకలోకం మీద జాలి కలిగింది.

నిన్న రాత్రి రాత కార్యక్రమం మళ్ళీ మొదలుపెట్టాడు. ఇప్పుడేంకథ? అన్నాను, అమృతాంజనం సీసా అందుకుంటూ. కథ కాదు, రామాయణం అన్నాడు. వాల్మీకి నుంచి విశ్వనాథదాకా ఇంతమంది రాశాక నువ్విప్పుడు కొత్తగా ఏం రాస్తావు? అన్నాను. రామాయణాన్ని మగవాళ్ళ కోణం నుంచి పరిశీలిస్తున్నాడట. అసలు రామాయణంలో విలన్లందరూ ఆడవాళ్లేనట. ఆడవాళ్ళని వేంప్ అంటారు, మగాళ్ళని విలన్ అంటారు, మొద్దు మొహవా, అని వివరించాను.

విలన్, వేంప్ అని లింగ విభజన అనవసరంట. విలనంటే అసలు ఆడదనే అర్థంట (లింగమూర్తి చెప్పాడట). మగాళ్ళలో రాస్కెలున్నర రాస్కెల్సు ఉంటారు

కదా అంటే, వాళ్ళు స్వతహాగా మంచి వాళ్ళే, స్త్రీలే వాళ్ళని అలా తయారు చేస్తున్నారంటాడు. అసలు రామాయణంలో విలన్లందరూ ఆడవాళ్ళే..... కైక, మంధర, సీత, శూర్పణఖ.......

శూర్పణఖ విలనెల్లా అయిందని అడిగాను. శూర్పణఖ పెద్ద గూండీ. రాముడిని రేప్ చేయడానికి ప్రయత్నించింది. అడవిలో కోర్టులు, జెయిళ్ళు ఉండవు కనుక లక్ష్మణ స్వామి రేప్ నేరానికి సింపుల్‌గా శూర్పణఖ ముక్కూ, చెవులూ కోసేశాడు. శూర్పణఖ లెంపలేసుకుని బుద్ధిగా ఉండకుండా, సిగ్గు లేకుండా రావణుడి దగ్గరకు వెళ్ళి, ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పి, రామ రావణ యుద్ధానికి కారణమైందట.

'సీతాదేవి విలనెల్లా అయిందిరా మొగుడా?' అన్నాను తల పట్టుకుని.

కైక రాముడిని అడవికి పొమ్మంది కానీ సీతను కాదు కదా! అరణ్యావాసమంటే అరకువేలీ పిక్నిక్ కాదు, అక్కడ పులులు, సింహాలు ఉంటాయి. అడవికి పోయి నా ఏడుపేదో నేనేడుస్తాను, నువ్వూ ఊర్మిళలాగా స్లీపింగ్ టేబ్లెట్స్ వేసుకుని పడుకో, అన్నాడట రాముడు. 'నాట్- నేనూ వస్తాను' అని కూడా బయలుదేరిందట సీతాదేవి. నార చీరలు కట్టుకునే కండీషను మీద కదా అరణ్యావాసానికి వెళ్ళింది. అక్కడకు వెళ్ళాక బంగారు లేడిని చూసి ముచ్చట పడి, జాకెట్టు కుట్టుకుంటాననదట. జంతు హింస పాపం - మేనకాగాంధి గారు బాధపడతారు- పిచ్చి కుక్కమీద రాయి విసిరినా కలతపడే సున్నిత హృదయం ఆవిడది, ఇన్ని లెదర్ జాకెట్లుండగా మళ్ళీ ఆ జింకచర్మం ఎందుకు? అని రాముడు గోలపెట్టినా వినక తరిమిందట. 'రావుడికేం కాలేదు సీతమ్మా, అది మాయలేడి మాయమ్మా' అని లక్ష్మణ స్వామి మొత్తుకున్నా వినక నానా తిట్లు తిట్టి రాముడికి హెల్ప్ చేయమని తన్ని తగలేసిందట.

అంతటితో అవలేదు. ఆంజనేయస్వామి సీతాదేవిని వెతుక్కుంటూ లంక చేరి, అశోకవనంలో సీతాదేవిని చూపి, 'చుప్‌చాప్‌గా నా భుజాల మీద ఎక్కించుకుని క్షణంలో రాముడి దగ్గరకు తీసుకుపోతాను, పద తల్లీ అంటే', 'నాట్ - రావుడొచ్చి యుద్ధం చేసి రావణున్ని చంపి, నన్ను విడిపించి తీసుకెళ్ళాలిగాని ఇల్లాంటి షార్ట్‌కట్‌లో తిరిగి వెళ్ళను' అని మొండికేసిందట. 'రావణుడు రావుడితో ఫైట్ చేసి నిన్ను తీసుకొచ్చాడా? వాడూ ఎత్తుకొచ్చాడుకదా? యుద్ధమైతే నరనష్టం, వానర నష్టం, లంక నాశనం' అని ఆంజనేయస్వామి అంటే 'యుద్ధంలో చచ్చేది మగాళ్ళే కదా! మాదేం పోయింది? నాట్- నేను రాను' అందట సీతాదేవి.

అసలు విలన్ - ఇన్ - చీఫ్ సీతాదేవే లేకుండా ఉంటే రావుడు, రావణుడు నందమూరి తారకరామారావుగారి ద్విపాత్రాభినయంలా, అన్నదమ్ముల్లా కలిసి ఉండేవారట. ఇదీ రాఘవుడి మగవాద రామాయణం. రామాయణమేకాదు - మహాభారతం, పురాణాలూ అన్నీ మగవాద కోణం నుంచి పరిశీలించి, ఇతనూ, లింగమూర్తి తిరగరాస్తున్నారట.

ఫెమినిజం అంటే ఏమిటో వివరించి మొద్దుమొహం బ్రెయిన్‌కి కొంచెం పదును పెడదామని నీ సిద్ధాంత గ్రంథం ఫెమి'నిజం' అందుకుని పాఠం తీసుకున్నాను. అంతా విని 'ఆ ఊకదంపుడులో ఊకంతా ఎగరగొడితే గంగాదేవిది సింగిల్

పాయింట్ ప్రోగ్రాం - మగాడిని పిలకట్టుకు జాడించడం. పిలకంటే గుర్తుకొచ్చింది - ఓ పిలక కవిత వినిపిస్తా-

అందాల ఓ చిలకా!
అందుకో నా పిలకా!
అంటాడు ! పాపం అమాయకుడు
మూడు ముళ్ళూ వేసి
ముప్పు తిప్పలు పడతాడు
అయ్యో ! అభాగ్యుడు!

అంటూ ఓ పిచ్చి కవిత వినిపించాడు.

'నువ్వు కవితలు కూడా రాస్తున్నావేమిటి? 'అన్నాను ఆశ్చర్యపోయి.

'నేను కాదు, లింగమూర్తి - ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, గురువుగారి పిలక చేతిలో ఉన్నంతకాలం వంట చేయలేదని, అంట్లు తోమలేదని, ఆయన్ను వేపించుకు తింది. ఆయన పిలక చేయి జారిపోయిన తర్వాత మగ జాతి పిలకట్టుకుంది. ఆవిడ సింగిల్ పాయింట్ ప్రోగ్రాంలో రెండో పాయింటు, అసలు పాయింటు ఏమిటంటే, ఫెమినిజం పేరు చెప్పి తన్ను తాను ఉద్దరించుకోవడం' అంటూ మొదలుపెట్టాడు.

'ఇంక వాగకు, పిచ్చెక్కేట్లుంది' అన్నాను చెవులు మూసుకుంటూ.

'అయితే ఇంకా మాట్లాడతాను' అంటూ తను నిద్రపోకుండా, నన్ను నిద్ర పోనివ్వకుండా, రాత్రి తెల్లార్లూ అడ్డంగా వాదిస్తూనే వున్నాడు.....

ఏదో రాద్దామని ప్రారంభించి ఏదో రాసినట్టున్నాను - చెప్పానుగా నా మానసిక పరిస్థితి - అర్థం చేసుకుంటావనుకుంటాను. ఉత్తరం చాలా పెద్దదయిపోయినట్టుంది. ఇంక ముగిస్తాను.

ఉత్తరాలు రాస్తుండు!

ఫెమినిస్టు అభినందనలతో
గౌరి

పి.ఎస్: ఇతని ప్రభావంతో కుర్ర వెధవ కూడా పాడైపోతున్నాడని భయం వేస్తోంది. 'సరిగమ' అనరా అంటే 'సరిమగ' అంటున్నాడు, వెధవ మగబుద్ధి!

## 2

ప్రపంచ మహిళల్లారా! ఏకం కండి! మీకు పోయేదేమీ లేదు - మొగుళ్ళు తప్ప!

హైదరాబాద్,
15.1.1999

డియర్ గౌరీ,

నీ ఉత్తరం చూడగానే నాకు డిప్రెషనొచ్చేసింది. మనం స్త్రీలలో వేన్ గార్డు లాంటి వాళ్ళం. ఆకాశంలో సగానికి దారి చూపాల్సిన వాళ్ళం. మనమే ఇలా తప్పుదారిన పోతే ఎలా చెప్పు!

మనలో ఇంకా ఎన్ని పితృస్వామ్య భావాలు ఎలా జీర్ణించుకు పోయాయో నువ్వు, నీ ఉత్తరం 'శ్రీరామ' అని ప్రారంభించడంతోటే స్పష్టమవుతోంది. నాకు దేవుడిలో విశ్వాసం లేదు. నేను సోషలిస్టు ఫెమినిస్టుని. నువ్వు ఆస్తికురాలివి కావచ్చు-తప్పులేదు. ఫెమినిజం శంభుడి చెరువులా విశాలమైనది. అన్ని కులాలు, మతాలు, వర్గాలు, ప్రాంతాలు, దేశాల స్త్రీలను, అన్ని రకాల భావాలను, విశ్వాసాలను తనలో ఇముడ్చుకునే శక్తి కలది. నీకు దైవ భక్తి ఉంటే, నువ్వు ఫెమినిస్టుగా 'శ్రీ సీత' అంటూ నీ ఉత్తరం మొదలు పెట్టి ఉండాల్సింది. భాష పదాలు చాలా ముఖ్యమైనవి. స్త్రీలకి భాషాపరంగా న్యాయం జరగాలంటే పురుష పక్షపాతాన్ని, పురుష దృక్పథాన్ని, పెంచి పోషిస్తున్న పురుష దురహంకార పదాలను వదిలేసి, నిరంతర చైతన్యవంతమైన స్పృహతో మనం పదాలు ప్రయోగించాలి. స్త్రీ విముక్తి పోరాటంలో భాష ఒక పదునైన ఆయుధం అన్న సంగతి మరిచిపోకూడదు.

స్త్రీల సమస్యల పట్ల స్త్రీ వాదులలో కూడా ఎంత తప్పుడు అవగాహన ఉందో నీ ఉత్తరం చూస్తే అర్థమైంది. నీ వ్యక్తిగత సమస్యలు నాతో చర్చించాలి అన్నావు. స్త్రీల జీవి తాలలో రాజకీయం కాని వ్యక్తిగత సమస్యలున్నాయా? రాఘవ గెడ్డం, సెక్సువాలిటీ, నీ ఒక్కదానికే సంబంధించిన సమస్య కాదు. మొత్తం స్త్రీ జాతికి సంబంధించిన రాజకీయ సమస్య.

స్త్రీ సమాజంలో ప్రతీ విషయంలోనూ ఎంత వివక్షతకు గురవుతోందో తలుచు కుంటే గుండెలు మండిపోతాయి నాకు. మొన్న హోటలుకి వెడితే మాడిపోయినపెసరట్టు నాకు, మంచి పెసరట్టు పక్కనున్న మగాడికి అందించాడు సెర్వర్. ఈ పురుషస్వామ్యవ్యవస్థలో, స్త్రీ మాడిన పెసరట్టు తప్ప మంచి పెసరట్టు ఆశించడం అత్యాశే. ఫెమినిజం ప్రత్యేకత ఏవిటంటే , అది మార్క్సిజం లాగా ఆర్థిక వ్యవస్థ ఉపరితలం అంటూ నిత్య జీవితంతో సంబంధంలేని ఏవో కొన్ని సూత్రాలు, సిద్ధాంతం కాదు. ఫెమినిజం మన రోజువారీ జీవితాలనుంచి వేరుగా ఉండదు. ఫెమినిస్టు పరికరాలతో పెసరట్టుని విశ్లేషిస్తే, యాదృచ్ఛికంగా నీచేతికి వచ్చినట్టు అనిపిస్తున్న మాడిన పెసరట్టు వెనుక పితృస్వామ్య హస్తం కనిపిస్తుంది. ఫెమినిస్టు విశ్లేషణలో బలం అక్కడే ఉంది. మార్క్సిజం కానీ, మరే ఇజం కానీ ఇంత సూటిగా, స్పష్టంగా పెసరట్టు గురించి వివరించలేదు (నిజం చెప్పాలంటే స్త్రీలని, స్త్రీల రోజువారీ సమస్యల్నీ, ఫెమినిజం పట్టించుకున్నట్టు మార్క్సిజం ఏనాడూ పట్టించుకోలేదు)

ఇక్కడ పితృస్వామ్య వ్యవస్థ రెండు స్థాయిలలో పనిచేస్తుంది. మగ ప్రపంచంలో మగాడికున్న ప్రత్యేక స్థానం వలన, అడగకుండానే మంచి పెసరట్టు సంపాదించ గలుగు తున్నాడు. సెర్వర్పురుషుడు. వాడు తోటి పురుషుడికి మంచి పెసరట్టే ఇవ్వాలను కుంటాడు. ఇది కంటికి కనిపించని, అత్యంత సహజంగా అనిపించే వివక్ష. రెండో కారణం - స్త్రీలంటే చులకన. సెర్వర్ వంటవాడితో....(ఇక్కడ ఇంకో

వైరుధ్యం వుంది. ఇంట్లో సాధారణంగా ఆడదే వంట చేస్తుంది. హోటల్లో సాధారణంగా మగవాడే వంట చేస్తాడు. మరొకటి గమనించావోలేదో- నలభీమపాకం అంటారుకానీ దమయంతీ- ద్రౌపదీపాకం అనరు. శ్రమ స్త్రీలది, పేరు పురుషులది. మనం రీసెర్చి చేసి, దీని వెనుక వున్న పితృస్వామ్య వ్యవస్థ కుట్రను బహిర్గతం చేసి, స్త్రీవాద సిద్ధాంతానికి పదును పెట్టాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది)......సెర్వర్ వంటవాడితో 'బాసూ, పెసరట్టు మాడిపోయిందని' చెప్పే వుంటాడు. 'ఏం పర్వాలేదు. ఫామిలీ రూంలో ఆడంగులుంటారు. వాళ్ళకిచ్చేయ్' అని జిడ్డుమొహం వంటవాడు అనే ఉంటాడు. ఇదంతా నేను ఊహించగలను. మాడిన పెసరట్టు ఇస్తే, ఆడది ఏం చేస్తుందని వాడి ధైర్యం. అక్కడ ఉన్నది మామూలు ఆడది కాదని, ఫెమినిస్టు పులి అని వాడికి తెలియదు. వాడి పెసరట్టు వాడి మొహాన కొట్టి, పితృస్వామ్య వ్యవస్థను నిరసిస్తూ నినాదాలిచ్చేసరికి సెర్వర్ దగ్గరనుంచి ప్రొప్రైటరు దాకా అంతా కాళ్ళ మీద పడ్డారు. పెసరట్టు అయినా పరమాణు బాంబు అయినా, ఏదైనా స్త్రీల దృక్పథం నుంచి, ఫెమినిస్టు పరికరాలతో విశ్లేషించడం ప్రతీ స్త్రీవాది అభ్యాసం చేయాలి.

అణుబాంబంటే గుర్తొచ్చింది. స్త్రీ సైంటిస్టు ఎవరైనా మగాళ్ళ మీద మాత్రమే పేలే అణుబాంబు కనిపెట్టగలిగితే ఎంత బావుంటుంది? ఇంతవరకు పురుషులు ఆయుధ బలం చూపించి మనను లొంగదీసి బానిసల్ని చేశారు. మనం అటువంటి ఆయుధాలు చేసి ఈ పురుష ప్రపంచాన్ని నాశనం చేస్తే? కంగారుపడకు - తరతరాలుగా ఈ మగజాతి స్త్రీలను గురి చేసిన హింస గుర్తుకొచ్చి ఆవేశంలో అంటున్నాను కానీ, మగాళ్ళు లేకపోతే మనమేమైపోతాం. మొగుళ్ళొద్దంటున్నాం కానీ మగాళ్ళు వద్దంటల్లేదు కదా!

రాఘవ కాఫీ తీసుకొచ్చినప్పుడు, మీరందరూ అంత ఇబ్బంది పడిపోవడానికి కారణమేమీ నాకు కనిపించలేదు. సెక్సువాలిటీ అంటే మన శరీరం పట్ల మనం ఏర్పరచు కున్న భావాలు, ఇతరులతో స్పందించే పద్ధతి, సమాజానికున్న విలువలు, నమ్మకాలు, అభిప్రాయాలు - ఇవన్నీ కలిసి సెక్సువాలిటీ - లైంగికత్వం - అవుతుంది. ఇది శరీరానికి మాత్రమే సంబంధించినది కాదు, సంస్కృతి పరమైనది. రాజకీయమైనది. ఈ పితృ స్వామ్య వ్యవస్థలో స్త్రీలకు ఎదురయ్యే నిజమైన ఆటంకం బిడియం. స్త్రీల లైంగికత్వం మీద ఆధిపత్యం వహించడానికి సభ్యత, సిగ్గు, గౌరవం, మర్యాదల భావజాలాన్ని సృష్టించారు. ఈ పురుష ప్రపంచం మన లైంగికత్వం మీద, వేషభాషలమీద విధిస్తున్న కంట్రోళ్ళను ధిక్కరిస్తూ, పైటలు తగలేస్తూ, మగ గుండెలు షాకుతో అదిరిపోయేలా ఆల్చిప్ప, అరటిపండు అంటూ అంగాంగాల్ని వర్ణిస్తూ, స్వేచ్ఛగా గొంతువిప్పి జెండర్ విధానాన్ని సవాలు చేసి, వాళ్ళు గీసిన మర్యాద రేఖల్ని చెరిపేస్తున్నప్పుడు, స్త్రీల ఎదురుగా పురుషులు మర్యాదగా, సభ్యతగా, మృదువుగా మాట్లాడాలని, ప్రవర్తించాలని మనం డిమాండు చేయడం స్త్రీలుగా మన పట్ల వివక్షత చూపించమని అడిగినట్టవుతుంది. మనల్ని మనం వేరు పరుచుకుని కించపరుచుకోవడం అవుతుంది. ఫెమినిజం నీకు సరిగా అర్థం కాలేదు. ఫెమినిస్టు సాహిత్యం నువ్వు సీరియస్‌గా అధ్యయనం చెయ్యాలి.

లింగమూర్తి ఈ మధ్య మరీ పేట్రేగి పోతున్నాడు. అతనికి విడాకులిచ్చి, ముక్కుకు తాడు తీసేసి దేశం మీదకు వదిలేశానేమోనని నాకూ అనిపిస్తోంది. మేం విడిపోయిన రోజు విమోచన దినంగా ప్రకటించి 'గంగ మొగుడిగానే కాని గుర్తింపులేని లింగమూర్తి, గంగాదేవి పెట్టిన శారీరక, మానసిక, లైంగిక హింసల నుంచి విముక్తి పొంది, హండ్రెడ్ పర్సెంట్ మగాడిగా ఈ రోజునుంచి నూతన జీవితం ప్రారంభిస్తున్నాడు' అంటూ విమోచన దినోత్సవం చేశాడట ఈ మధ్య. ఆ సభలో లింగమూర్తి ఉపన్యాసం ఇస్తుంటే సుధ మొగుడు నిద్రపోతూ, నిద్రలో అలవాటుగా 'హరి హరీ, శంకరీ, మహాదేవీ' అంటూ ఆవలించాడట. లింగమూర్తికి కోపం వచ్చి 'శంకరీ! మహాదేవీ' అంటున్నావు, వర్గద్రోహీ- మగదేవుళ్ళంతా చచ్చారనుకున్నావా?' అంటూ వెయ్యి రూపాయలు ఫైను వేశాడట - సుధ చెప్పింది.

'మగోడు' ప్రారంభ సంచిక చూశాను. 'నా రెక్కలు నాకు ప్రసాదించి నన్ను మళ్ళీ స్వేచ్ఛా జీవిని చేసిన ప్రియ నేస్తం గంగా దేవికి, కృతజ్ఞతలతో', అని రాసి పంపించాడు లింగమూర్తి. నిన్ననే అందింది. అందులో నడి వేసవిలో, మధ్యాహ్నం 12.07 ని.కు. ఇంటి కప్పెక్కి కూర్చొని రాసిన అతని మగవాద కవిత చదివావా?

*' మొగుణ్ణి కొట్టి మొగసాలకెక్కి*
*ఏడుస్తున్న శర్మిష్ట*
*ను చూసి తనూ ఏడ్చిందొక ఫెమినిస్టు!*
*అయ్యో! నాకూ మొగుడుంటే*
*నా సరదా కూడా తీరేది కదా! అని'*

ఈ వెధవ కవితల్ని, గేయాలు, పద్యాలు, వచన కవితలు అనకూడదట - లింగాలు అనాలిట. ఇలా మాటొక్క లింగాలు రాసి ఆ శతకం నాకు అంకితం చేస్తాడట! లింగమూర్తి పిచ్చి రోజు రోజుకు ముదిరి పోతున్నట్టుంది. ఎందుకని ఊరుకుంటున్నాను కాని తిక్కరేగిందంటే ఎప్పుడో లింగమూర్తి బుర్ర సీతకీర్తన పాడించేస్తాను. అంతవరకు అవాకులు, చవాకులు అలా రాస్తూనే ఉంటాడు. గురువుకు మందేస్తే శిష్యుడి రోగం కుదురుతుందని నా నమ్మకం. కుదరకపోతే రావుడి గుండు సంగతి తర్వాత చూద్దాం.

లింగమూర్తి లాంటి వర్గ శత్రువులకంటే తీవ్ర ప్రమాదం - కనించని ప్రమాదం - తోటి ఫెమినిస్టులనుంచే ఎదురవుతోంది. ఈ మధ్య ఫెమినిస్టులం సమావేశమై, ఇంతవరకు మగాళ్ళు దేశాన్ని పాలించి తగలేశారనీ, ఇప్పుడు ఇంక కాగడా మనం చేతుల్లోకి తీసుకోవాల్సిన సమయం వచ్చిందనీ భావించాం. స్త్రీల రాజకీయ పార్టీ పెడితే బాగుంటుందనుకున్నాం. మనలో ఎవరు గొప్ప, ఎవరు తక్కువ, ఎవరు నాయకురాలు, ఎవరు అనుచరులు అనే భావం ఉండకూడదని, పురుష సమాజం సృష్టించిన ఈ రకమైన హైరార్కీల చట్రంలోకి, పోటీ ధోరణిలోకి, మనం స్త్రీలం వెళ్లకూడదని, ఈ సారి యంపీగానో, మంత్రిగానో స్త్రీలకు సేవ చేసే బాధ్యత నేను

వహిస్తానని ఎంత చెప్పినా వినక 'నేనూ సేవ చేస్తాను' అంటూ మొదలెట్టింది కావేరి. దాంతో పెద్ద గొడవ అయింది. చివరకు నిర్ణయం వాయిదా పడింది. ఫెమినిస్టు ఎజెండాతో పార్లమెంటును గజగజలాడించే మహత్తర అవకాశం తప్పిపోయింది. మన వాళ్ళనుంచి మనల్ని దూరం చేయడానికి, ఎలియనేషన్‌కి గురి చేయడానికి పురుషస్వామ్య వ్యవస్థ కుట్ర ఇది. ఈ కుట్ర గుర్తించకుండా ఒకరితో ఒకరు పోటీలోకి దిగితే ఎవరికి వాళ్ళే అవుతాం. కావేరికి ఎప్పుడు బుద్ధొస్తుందో, ఎప్పుడు ఈ పురుష రాజకీయ పోటీ సంస్కృతి నుంచి బయట పడుతుందో తెలియడం లేదు.

బహుశా నీకు తెలిసేవుంటుంది - నాకవిత 'పులుసు రాచ్చిప్ప' కు ఉత్తమ ఫెమినిస్టు కవితగా లేడీ క్లింటన్ ఎవార్డు వచ్చింది. ఆ ఎవార్డు తీసుకోవడానికి వారం రోజుల్లో వాషింగ్టన్ వెడుతున్నాను. నా 'చారుగిన్నె' కంటె 'పులుసురాచ్చిప్ప' ఏం గొప్పది? గంగ ఇదంతా మేనేజ్ చేసింది, అని యమున అందరితోనూ అంటోందట. నేనూ నా జీవితాన్ని పణంగా పెట్టి ఎన్నెన్ని ప్రయోగాలు చేశాను? ముగ్గురు మొగుళ్ళతో సహా నా ముప్పయ్యేళ్ళ జీవితం ఫెమినిజానికి ఖర్చయిపోయిన సంగతి దానికి తెలియదా? నా త్యాగాలకి గుర్తింపు రాకూడదా? దానికి ఎప్పుడు బుద్ధొస్తుందో, ఎప్పుడు ఈ పురుష స్వామ్య అసూయ సంస్కృతినుంచి బయట పడుతుందో తెలియడం లేదు. 'పులుసు రాచ్చిప్ప' చదివి, వెనుకబడిన దేశాలలో స్త్రీల వంటింటికష్టాలు చూసి లేడీ క్లింటన్ కన్నీళ్లు పెట్టుకుందట. ఇక్కడ పేదస్త్రీలకు ఉచితంగా పంచడానికి పదివేల మైక్రో ఓవెన్‌లు పంపిస్తోందట - న్యూస్ వీక్ రాసింది. ఇక్కడ మనం పొయ్యి ఊదితే, లేడీ రాక్ ఫెల్లర్ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి - ఫెమినిస్టు సిస్టర్‌హుడ్ అంటే అది. వర్గాలకు, ఇజాలకు, అతీతమైనది ఫెమినిజం.

వంటిల్లు, ఇంటి చాకిరీ మన జీవితాలనీ, ఆలోచనలనీ, సాహిత్యాన్నీ ఎంతగా ప్రభావితం చేస్తున్నాయి అంటే నా మటుకు నేను ఎదురుగా అంట్ల గిన్నో, చీపురు కట్టో లేకపోతే కథలు, కవిత్వం రాయలేని పరిస్థితి వచ్చింది. నా ఎవార్డు కవిత ఎప్పుడు రాశానో తెలుసా? పనిమనిషి రెండు రోజులు రాలేదు. వంట మనిషి ఊరు వెళ్ళింది. శంకరం టూరుమీద వెళ్ళాడు. అప్పుడు వంటిల్లు ఎలా వుంటుందో ఊహించుకో. ఆ అంట్ల గిన్నెలు చూస్తుంటే విపరీతమైన కవితావేశం వచ్చి ఒక నిమిషంలో గేయం రాసి, మళ్ళీ ఫెయిర్ చెయ్యకుండా పంపించి వేశాను. నాకు ఏం రాయాలో తోచనప్పుడు, పనిమనిషిని, శంకరాన్ని పొమ్మని చెప్పి, వంటింట్లోకి వెళ్ళి అంట్లు తోమడం మొదలు పెడతాను. అద్భుతమైన అయిడియాలు, ఆవేశం వచ్చేస్తాయి.

స్త్రీల లైంగికత్వం మీద ఎలాంటి ఆంక్షలు, నిర్బంధాలు ఉన్నాయన్న దాన్ని బట్టి సమాజంలో స్త్రీల స్థానం ఆధారపడి వుంటుందని మనం చెబుతుంటే బుర్రకెక్కనట్టు నటిస్తూ, ఆర్థిక అసమానత లైంగిక అసమానతకు కారణమవుతోందనీ, స్త్రీకి ముందు ఆర్థిక స్వాతంత్ర్యం, చదువు చట్టుబండలు కావాలని అరిగిపోయిన రికార్డులు వేసే వాళ్ళను చూస్తే పరమ చికాకు కలుగుతుంది. ఈ సమస్యలన్నీ మన ఫెమినిస్టులం

పరిష్కరించలేని రాజకీయ చట్రాలలో వున్నాయన్న సంగతి వీళ్ళకు తెలియదా? రాజకీయాల రొట్లో తలపెట్టి మనం బుర్రలు బద్దలు కొట్టించుకోవాలి అని వీళ్ళ ఉద్దేశమా? మన స్వచ్ఛంద సంస్థలకి వస్తున్న ఫండ్స్ ఇంకిపోయేలా చెయ్యడానికి, ఇప్పుడు పడుతున్న దండల బదులు అరదండాలు, విదేశీయాత్రల బదులు పరలోక యాత్రలు చేయించడానికి కుట్ర ఇది. వర్గ చైతన్యం పేరుతో మనలో మనకి విబేధాలు కల్పించి స్త్రీల ఆగ్రహాన్నుంచి పురుషుడిని రక్షించడానికి పురుషస్వామ్య వవస్థ చేస్తున్న కుట్ర ఇది! వ్యవస్థ మారి, ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చేదాకా మూడు రేప్‌లు, ఆరు వరకట్నాల చావులు గా స్త్రీలు వర్ధిల్లాలని వీళ్ళ ఉద్దేశమా? ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నంత మాత్రాన స్త్రీల సమస్యలు తీరిపోతాయని వీళ్ళు రాసివ్వగలరా? ఏ దేశంలోనైనా, ఎక్కడేనా అలా జరిగిందా.....

సారీ! ఉత్తరం ఉపన్యాసంగా మారిపోతున్నట్టుంది. స్నేహితురాళ్ళందరూ అంటుంటారు,'ఫెమినిజం అనగానే ఎంత ఆవేశమే నీకు, నీతో మాట్లాడాలంటే భయం' అని. ఏం చెయ్యను? ఫెమినిజం నా ఊపిరి, జీవితం, జీవన సోపానం. మగజాతంటే ఎంత అసహ్యం అంటే నా ఫేవరేట్ ఫాంటసీ ఏమిటో తెలుసా? స్త్రీలు గెరిల్లా దాడులు చేసి పురుష దురహంకారుల బుర్రలు బద్దలు కొడుతూ మగజాతి గుండెల్లో వణుకు పుట్టిస్తున్నట్టు.....

జయగంటలా ఫోను మోగుతోంది.... ట్రావెల్ ఏజంటు దగ్గరనుంచనుకుంటా! వాషింగ్టన్ నుంచి వచ్చాక వివరంగా రాస్తాను, ఉంటా!

ఫెమినిస్టు అభినందనలతో
గంగ

**( ఆదివారం ఆంధ్రజ్యోతి, ఫిబ్రవరి, 24, 1999)**